


PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు




శనివారం 25 జులై 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :53 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

## అంతర్జాతీయ ఎన్నికల సహకారం మరింత బలోపేతం.. ఉరుగ్వే, దక్షిణాఫ్రికాతో కీలక అవగాహన

**ఎన్నికల నిర్వహణ, సిబ్బంది శిక్షణలో పరస్పర సహకారానికి భారత్-ఉరుగ్వే, భారత్-దక్షిణాఫ్రికా అంగీకారం**




న్యూఢిల్లీ | సందేశం టైమ్స్ ప్రతినిధి | జూలై 25: భారత ప్రధాన ఎన్నికల కమిషనర్, అంతర్జాతీయ ప్రజాస్వామ్య, ఎన్నికల సహకార సంస్థ సభ్య దేశాల మండలి అధ్యక్షుడు జ్ఞానేశ్ కుమార్ న్యూఢిల్లీలోని ఎన్నికల సదన్‌లో ఉరుగ్వే దేశ రాయబారి అల్బెర్టో ఎ. గ్వాని, దక్షిణాఫ్రికా దేశ హై కమిషనర్ ప్రొఫెసర్ అనిల్ సూక్‌లాల్‌లతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమగ్ర ప్రజాస్వామ్యం, ఎన్నికల నిర్వహణపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో రూపొందించిన కార్యాచరణను సంయుక్తంగా ముందుకు తీసుకెళ్లాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. ఎన్నికల నిర్వహణను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, ఎన్నికల సిబ్బందికి ఆధునిక శిక్షణ అందించడం, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడం, పారదర్శకతతో కూడిన ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు అంతర్జాతీయ స్థాయిలో సహకారాన్ని మరింత విస్తరించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రపంచ దేశాల ఎన్నికల సంస్థల మధ్య సమన్వయం పెంపొందించి, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు అవసరమైన అనుభవాలను పరస్పరం పంచుకోవాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. ఎన్నికల నిర్వహణలో భారత ఎన్నికల సంఘం అంతర్జాతీయ స్థాయిలో తన భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉందని ఈ సమావేశాలు స్పష్టం చేశాయి.

## కుటుంబ సభ్యుల సమక్షంలో కేటీఆర్ జన్మదిన వేడుకలు.. కేసీఆర్ దంపతుల ఆశీర్వాదాలు




ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం | సందేశం టైమ్స్ ప్రతినిధి | జూలై 25: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్), శ్రీమతి శోభ దంపతులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. అనంతరం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో తండ్రి కేసీఆర్‌తో పాటు కుటుంబ సభ్యులతో కలిసి కేటీఆర్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ సతీమణి శైలిమ, కుమారుడు హిమాన్షు, కుమార్తె రియాన్షి, ఇతర కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కేటీఆర్ ఆప్యాయంగా గడుపుతూ మొక్కల పెంపకం, పచ్చదనం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నట్లు సమాచారం.

## తెలంగాణ హరే కృష్ణ ఫౌండేషన్కు రూ.22.18 కోట్ల విరాళం విద్యార్థుల పోషకాహారానికి కార్పొరేట్ తోడ్పాటు

# ప్రభుత్వ పాఠశాలల అల్పాహార పథకానికి రూ.22.18 కోట్ల సీఎస్ఆర్ నిధులు

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | జూలై 25: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న అల్పాహార పథకాన్ని మరింత విస్తరించేందుకు దివీస్ లేబొరేటరీస్, అరబిందో ఫార్మా సంస్థలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల కింద మొత్తం రూ.22.18 కోట్ల ఆర్థిక సహాయాన్ని హరే కృష్ణ మూవ్‌మెంట్ సేవా సంస్థకు అందజేశాయి. ఎంసీఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో దివీస్ సంస్థ రూ.12.18 కోట్ల చెక్కును, అరబిందో ఫార్మా రూ.10 కోట్ల చెక్కును సంస్థ ప్రతినిధులు హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించడంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ సేవలను ముఖ్యమంత్రి అభినందించడంతో పాటు, ఈ పథకానికి ఉదారంగా నిధులు అందించిన రెండు ఔషధ సంస్థలను ప్రశంసించారు. ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కేంద్రీకృత వంటశాలల అవసరాల కోసం సమీప ప్రాంతాల రైతుల నుంచి నేరుగా బియ్యం, కూరగాయలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసే విధానాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని, తద్వారా రైతులకు మెరుగైన ఆదాయం లభించడంతో పాటు సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి పంటల మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు.



ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్, హరే కృష్ణ మూవ్‌మెంట్ సేవా సంస్థ అధ్యక్షుడు సత్య గౌర చంద్ర దాస్ ప్రభుజీ, దివీస్ లేబొరేటరీస్ ఉపాధ్యక్షుడు మధుబాబు, అరబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జనావాసాల మధ్యే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | జూలై 25: హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా (క్యూర్) పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్లు జనావాసాలకు సమీపంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన నిరుపయోగ భూములను గుర్తించి గృహ నిర్మాణానికి వినియోగించాలని సూచించారు. క్యూర్ ప్రాంతంలోని ఇందిరమ్మ గృహాల నిర్మాణంపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో గుర్తించిన ప్రభుత్వ స్థలాల వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించగా, పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు చెందిన వినియోగంలో లేని స్థలాలను గృహ నిర్మాణానికి కేటాయించి, ఆయా శాఖలకు అవసరమైతే ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలని సూచించారు. జనావాసాలకు దూరంగా ఇళ్లు నిర్మిస్తే పేదలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దూరమవడంతో పాటు ఆ గృహాలు నిరుపయోగంగా మారే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అందువల్ల పనిస్థలాలకు చేరువలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలోని 17 నియోజకవర్గాల్లో తొలి దశగా 7,680 ఫ్లాట్లు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. ఒక్కో ఫ్లాట్ 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ విస్తీర్ణంలో నిర్మించనుండగా, ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం సుమారు రూ.11 లక్షలు అవుతుంది. ఇందులో రూ.5 లక్షలను ప్రభుత్వం సబ్సిడీగా భరిస్తుండగా, మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుంది. భూమి వ్యయాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరించనుంది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఈ గృహాల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రభుత్వ నిరుపయోగ భూములను త్వరితగతిన గుర్తించి గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవం.. ఘనంగా నిర్వహించాలని మంత్రి లోకేష్ ఆదేశం

### ఆంధ్రప్రదేశ్

విజయనగరం | సందేశం టైమ్స్ ప్రతినిధి | జూలై 25: ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దిశను చూపనున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం (భోగాపురం)ను ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్న నేపథ్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, చారిత్రాత్మకంగా నిర్వహించాలని రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం భోగాపురం విమానాశ్రయంలో జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి స్వయంగా పరిశీలించి అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రారంభోత్సవానికి వచ్చే అతిథులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని, భద్రత, రవాణా, పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు, పరిశుభ్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి అన్ని అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల కల సాకారం కానున్న ఈ విమానాశ్రయం రాష్ట్ర అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తరాంధ్రకు కొత్త గుర్తింపును తీసుకురానుందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.



## విద్యాసంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు.. యాజమాన్యాలదే పూర్తి బాధ్యత: సీఎం



హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | జూలై 25: రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు యాజమాన్యాలను కూడా ప్రత్యక్షంగా బాధ్యులను చేసే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థలోని బోధి పెవిలియన్‌లో మాదకద్రవ్యాల నియంత్రణ, భద్రతా కమిటీలపై పోలీసు ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లోనే కాకుండా క్యాంపస్ వెలుపల విద్యార్థులకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలను కూడా గుర్తించి సమాచారం అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రస్తుతం ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు అవసరమైతే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రతి విద్యాసంస్థలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు టోల్‌ఫ్రీ నంబర్, ప్రత్యేక క్యూ ఆర్ కోడ్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని గుర్తించడం, బాధితులను వ్యసనం నుంచి బయటపడేలా చేయడం, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవడం అనే మూడు దశల్లో సమర్థవంతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మొదటిసారి పట్టుబడిన వారిని వ్యసన విముక్తి కేంద్రాలకు పంపించి కౌన్సెలింగ్ అందించడంతో పాటు పదేపదే నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు విధించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించడంలో ప్రభుత్వం రాజీపడబోదని, విద్యాసంస్థలకు అధికారాలతో పాటు పూర్తి బాధ్యతలను కూడా అప్పగించే దిశగా చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ఈగల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



## ప్రతి కుటుంబం ఒక మొక్కను నాటి పర్యావరణాన్ని కాపాడాలి

మెదక్ జిల్లా, అల్లాదుర్గం | సందేశం టైమ్స్ రూరల్ రిపోర్టర్ | జూలై 25: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అల్లాదుర్గం గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో ప్రతి కుటుంబానికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు యువత సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. విచక్షణారహితంగా చెట్ల నరికివేత కొనసాగితే భవిష్యత్ తరాలకు తీవ్రమైన పర్యావరణ సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని కోరారు. పచ్చదనం పెంపొందితేనే స్వచ్ఛమైన వాతావరణం, ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, ఫీల్డ్ అసిస్టెంట్ సుకుబాయి తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ జన్మదినం సందర్భంగా తలసేమియా బాధిత చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

మధిర, ఖమ్మం జిల్లా | సందేశం టైమ్స్ జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్ | జూలై 25: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని మధిరలోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు ముఖ్య అతిథిగా పాల్గొని రక్తదాతలను అభినందించారు. తలసేమియా బాధిత చిన్నారులకు నిరంతరం రక్తం అవసరమవుతుందని, ఇటువంటి సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతకాని మండల బీఆర్ఎస్ నాయకులు వంకాయలపాటి లచ్చయ్య, కోపూరి నవీన్, నాదెండ్ల వెంకటేష్, నరేష్, గోపి, ప్రభాకర్, నాగేశ్వరరావు, సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ పార్టీ నాయకులు అభినందించారు.

## నీట్ పేపర్ లీక్‌పై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: గిద్దె రాజేష్




కోదాడ, సూర్యాపేట జిల్లా | సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి | జూలై 25: నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, లేదంటే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడలో బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్షలో చోటుచేసుకున్న పేపర్ లీకేజీ వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని ఆరోపించారు. పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే పరిస్థితులు పునరావృతం కాకుండా దేశవ్యాప్తంగా పరీక్షల వ్యవస్థను ప్రక్షాళన చేసి జాతీయ స్థాయి పరీక్షలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని, ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థి సంఘాల పిలుపు మేరకు కోదాడలో చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌కు రాజకీయ, విద్యార్థి, ప్రజా, ఉద్యమ సంఘాలు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## మృత హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా.. అండగా ఉంటామని ఎస్పీ భరోసా

మెదక్ | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | జూలై 25: మెదక్ జిల్లాలో విధి నిర్వహణలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హోంగార్డు ఎం. శివరాం, గుండెపోటుతో మృతిచెందిన హోంగార్డు టీ. మహేందర్ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారి డి.వి. శ్రీనివాసరావు (ఐపీఎస్) అందజేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎస్పీ వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకుని, పోలీసు శాఖ ఎల్లప్పుడూ వారి కుటుంబాలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హోంగార్డు శివరాం కుమారుడు బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్న విషయం తెలుసుకున్న ఎస్పీ, అతని విద్యార్హతలు, ఇతర వివరాలను సేకరించి ఉద్యోగం కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మహేందర్ భార్య ప్రస్తుతం ఉపాధి లేక ఇంటి వద్దే ఉన్నట్లు తెలుసుకుని, ఆమెకు తగిన ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. మృతుల కుటుంబాల సంక్షేమానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శైలేందర్, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నరేష్, రైటర్ శ్రావణ్, మృతుల కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## చింతకానిలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

చింతకాని, ఖమ్మం జిల్లా | సందేశం టైమ్స్ జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్ | జూలై 25: బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోవడంతో పాటు చిన్నారులకు కేక్ పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ అందించిన సేవలు విశేషమని, ముఖ్యంగా సమాచార సాంకేతిక, పరిశ్రమలు, పురపాలక పరిపాలన రంగాల్లో చేపట్టిన కార్యక్రమాలు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చాయని కొనియాడారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ యువతకు స్ఫూర్తిదాయక నాయకుడిగా నిలిచిన కేటీఆర్ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని పార్టీ ఐక్యతను చాటారు. ఈ వేడుకల్లో చింతకాని మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, మాజీ ఎంపీపీలు, సహకార సంఘాల డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, యువ నాయకులు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, గ్రామ పెద్దలు, చిన్నారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## వర్షపు నీటిని ఒడిసిపట్టాలి.. ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

మెదక్ జిల్లా, అల్లాదుర్గం మండలం, చిల్వేర్ | సందేశం టైమ్స్ రూరల్ రిపోర్టర్ కుమార్ | జూలై 25: అల్లాదుర్గం మండలంలోని చిల్వేర్ గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి లింగం, గ్రామ సర్పంచ్ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో జలసిరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాల మట్టాన్ని పెంచవచ్చని తెలిపారు. నీటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, వర్షపు నీటిని వృథా చేయకుండా సమర్థవంతంగా వినియోగిస్తే భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి సమస్యలను అధిగమించవచ్చని వివరించారు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉంటే ఎలాంటి నీటి కొరత వచ్చినా ప్రజలు ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని, రానున్న తరాలకు నీటి వనరులను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మెదక్ జిల్లా, అల్లాదుర్గం మండలం | సందేశం టైమ్స్ రూరల్ రిపోర్టర్ కుమార్ | జూలై 25: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నవ్య సూచించారు. శుక్రవారం అల్లాదుర్గం మండలంలోని బహిరందిబ్బ గ్రామాన్ని స్థానిక వైద్య సిబ్బందితో కలిసి సందర్శించిన ఆమె ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వ పాత్రలు, తొట్టెలను పరిశీలించి ప్రజలకు తగిన సూచనలు చేశారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వర్షాకాలంలో ఇంటి బయట లేదా ఆవరణలో నీటిని నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను కూడా పాటిస్తే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరప్ప, ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా మధిరలో సేవా కార్యక్రమాల సందడి





మధిర, ఖమ్మం జిల్లా | సందేశం టైమ్స్ జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్ | జూలై 25: బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని మధిరలో బీఆర్ఎస్ నాయకులు విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు ముఖ్య అతిథిగా పాల్గొని స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సంకల్ప వాలంటరీ ఆర్గనైజేషన్ పి. రవిచందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం మధిర మున్సిపాలిటీ పరిధిలోని దిడుగుపాడులో ఉన్న నిస్సి హరిణి ఆదరణ సేవా ఫౌండేషన్ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి ఆశ్రమ వాసులకు భోజనాలు అందించారు. తర్వాత మధిర ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి మానవతా సేవను చాటుకున్నారు. ఈ సందర్భంగా లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ ప్రజాసేవే కేటీఆర్ ఆశయమని, ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పల్లపోతు వెంకటేశ్వరరావు, అరిగే శ్రీనివాసరావు, యన్నంశెట్టి వెంకట అప్పారావు, చిత్తారు నాగేశ్వరరావు, బిక్కి కృష్ణ ప్రసాద్, రావూరి శ్రీనివాసరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, చావా వేణు, రంగిశెట్టి కోటేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, బొగ్గుల వీరారెడ్డి, పల్లపాటి కోటేశ్వరరావు, రామిరెడ్డి, భాస్కర్, భువనగిరి నారాయణరావు, ముత్తవరపు ప్యారి, రంగశెట్టి చిరంజీవి, కొటారు రాఘవరావు, అమరవాది కోటిరెడ్డి, వంకాయలపాటి లచ్చయ్య, పరిస శ్రీనివాసరావు, సయ్యద్ ఇక్బాల్, ఆళ్ల నాగబాబు, అబ్దుల్ ఖురేష్, చీదిరాల రాంబాబు, కటికల వెంకట సత్యనారాయణరెడ్డి, బత్తుల శ్రీనివాసరావు, వేల్పుల శివ, నీలం రమేష్‌బాబు, బెజ్జం కిరణ్, వీరంశెట్టి సీతారామయ్య, ఆరుద్ర కొండలరావు, లంకేమల్ల నాగేశ్వరరావు, దిల్‌కుమార్, సర్వేష్, త్రినేష్, సుమంత్, బన్ను, షేక్ షారు, ఆరిఫ్‌తో పాటు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలి: టీఎస్‌యూటీఎఫ్

నర్సాపూర్, మెదక్ జిల్లా | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | జూలై 25: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ), యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (టీఎస్‌యూటీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నర్సాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు పోస్టుకార్డుల ద్వారా వినతిపత్రాలు పంపించారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గంగాధర్‌రావు మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా కేజీబీవీ ఉద్యోగులు తక్కువ వేతనాలతో, ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా 24 గంటలపాటు విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సేవలను గుర్తించి వెంటనే క్రమబద్ధీకరించాలని, శాశ్వత ఉద్యోగులతో సమానంగా సెలవులు, కనీస వేతన శ్రేణి, వార్షిక వేతన పెంపు (ఇంక్రిమెంట్), ఆరోగ్య కార్డులు కల్పించాలని కోరారు. అలాగే రాత్రి విధుల నుంచి ఉపశమనం కల్పించేందుకు కేర్‌టేకర్లను నియమించాలని, 29 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను చెల్లించాలని, ఉద్యోగుల కేడర్‌కు అనుగుణంగా హోదాలను నిర్ణయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల కోశాధికారి రమేష్‌రాజు, కాంప్లెక్స్ కన్వీనర్ వస్రం, వొట్ కన్వీనర్ అప్పలనాయుడు, మోహన్‌తో పాటు కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | జూలై 25: ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై మెదక్ నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, పర్యవేక్షకులు, బీఎల్ఓలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా ఎస్ఐఆర్ నమోదు పనులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, బీఎల్ఓలు, పర్యవేక్షకులు తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సేకరించిన గణన పత్రాల డిజిటలీకరణ ప్రక్రియ దాదాపు 97 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా నిర్ణీత గడువు కంటే ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. మెదక్ మండలంలో 96 శాతం, పాపన్నపేటలో 95 శాతం, శంకరంపేటలో 100 శాతం, రామాయంపేటలో 97 శాతం, హవేలీ ఘనపూర్‌లో 98 శాతం, నిజాంపేటలో 96 శాతం, నార్సింగిలో 99 శాతం నమోదు ప్రక్రియ పూర్తయిందని అధికారులు వివరించారు. ఈ నెలాఖరు నాటికి అన్ని మండలాల్లో ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ బీఎల్ఓల నుంచి పురోగతి నివేదికలు తీసుకోవాలని, ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని, బూత్ స్థాయి ఏజెంట్లు, కౌన్సిలర్ల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాలను బీఎల్ఏలకు అందించి వారిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీఓ రమాదేవి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు గఫార్, మెదక్ డివిజన్ పరిధిలోని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా బీజేపీ రాస్తారోకో.. దిష్టిబొమ్మ దహనం



మెదక్ | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | జూలై 25: భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ ఆయన చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ, నీట్ పరీక్ష అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని విమర్శించారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో నిరసనలకు పిలుపునివ్వడం, ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించే ప్రయత్నం చేయడం బాధ్యతారాహిత్యమని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యులైన వారిపై ఇప్పటికే చట్టపరమైన చర్యలు తీసుకుని అరెస్టులు చేసినట్లు పేర్కొంటూ, అనంతరం నిర్వహించిన పరీక్షను విద్యార్థులు విజయవంతంగా రాశారని అన్నారు. దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులకు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇవ్వకూడదని, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు స్వస్తి పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రంజిత్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు కౌన్సిల్ శంకర్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు గడ్డం కాశీనాథ్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జైన్ సింగ్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మల్లిక, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాలరాజు, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, సర్పంచులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.




## వర్షపు నీటి ప్రతి చుక్కను ఒడిసిపట్టాలి.. ఇంకుడు గుంతల నిర్మాణం తప్పనిసరి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | జూలై 25: వర్షపు నీటి ప్రతి చుక్కను భూగర్భంలోకి పంపించి జల వనరులను పెంపొందించేందుకు ఇంకుడు గుంతల నిర్మాణాన్ని తప్పనిసరిగా చేపట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల పెంపు, సంరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీ-జీ రామ్‌జీ) కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల పెంపు పనులపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలతో మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూగర్భ జలాలను పెంచేందుకు ఇది అనుకూల సమయమని, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భవిష్యత్తులో నీటి సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. నీటి భద్రత కోసం ఫామ్ పాండ్లు, వ్యక్తిగత ఫామ్ పాండ్లు, బోరు బావుల రీచార్జ్ గుంతలు, వర్మీ కంపోస్ట్ యూనిట్లు, పర్కొలేషన్ ట్యాంకుల నిర్మాణాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించడం, సాకులతో ఆలస్యం చేయడాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి మండలంలో ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవోలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేసి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో ఎదురయ్యే ప్రకృతి విపత్తులను సమిష్టిగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు ఉపయోగపడే విధంగా జల సంరక్షణ కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి: సీఎస్ సంజయ్ జాజు

మెదక్ | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | జూలై 25: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ఎల్‌నినో నేపథ్యంలో పంటల వైవిధ్యీకరణ, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ తదితర అంశాలపై వివిధ శాఖల ప్రధాన కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ధోరణులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 30 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలను జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. వాతావరణ శాఖ అంచనాలు ప్రస్తుత పరిస్థితులను ప్రతిబింబిస్తున్నాయని, పరిస్థితులు మెరుగుపడే అవకాశాలు తక్కువగా ఉన్న నేపథ్యంలో అధికారులు ఆలస్యం చేయకుండా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. రైతుల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. కనీస మద్దతు ధరపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించి, అపోహలను తొలగించాలని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అనేక పంటలకు కనీస మద్దతు ధర అమలులో ఉందని, వరి పంటకే మాత్రమే మద్దతు ధర ఉంటుందనే భావన సరికాదని స్పష్టం చేశారు. పత్తి సహా పలు పంటలకు కూడా ప్రభుత్వం రక్షణ కల్పిస్తోందని తెలిపారు. మార్కెట్ ధర కనీస మద్దతు ధర కంటే తగ్గితే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు వివరించాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతుల ఆదాయం తగ్గదని, కొన్ని సందర్భాల్లో అధిక ఆదాయం పొందే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు. కూరగాయల సాగును ప్రోత్సహించాలని, మార్కెట్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు మార్గదర్శనం చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలో అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేసి, అవసరమైన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం వీడియో సమావేశం తర్వాత మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ విద్యా, సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ఒక జత ఏకరూప దుస్తులను అందించాలని, ఆగస్టు 30 నాటికి రెండు జతల దుస్తుల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. వస్త్రాల సరఫరాలో సమస్యలను ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫాంల పంపిణీలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో పంటల సాగులో ఎదురయ్యే నీటి సమస్యలను రైతులకు వివరించి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతు వేదికలు, రైతు వాట్సప్ గ్రూపుల ద్వారా కనీస మద్దతు ధర లభించే పంటలు, కూరగాయల సాగుపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. గత ఏడాది సాగు వివరాలు, ప్రస్తుత సాగు పరిస్థితులపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాసరావు, జిల్లా విద్యాధికారి రాజు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కేజీబీవీ, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



## భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనితీరును పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | సందేశం టైమ్స్ జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్ | జూలై 25: భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లోని 4×270 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల పనితీరు, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియ, బొగ్గు వినియోగం, సింగరేణి సంస్థ నుంచి అందుతున్న బొగ్గు సరఫరా, నాణ్యత తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, నాణ్యమైన సింగరేణి బొగ్గు నిరంతరాయంగా అందేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్లాంట్ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## పుల్కల్ మండలంలో కలెక్టర్ ప్రతీక్ జైన్ పర్యటన.. విద్య, వైద్య సదుపాయాలపై సమీక్ష



సంగారెడ్డి | సందేశం టైమ్స్ ప్రతినిధి | జూలై 25: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం పుల్కల్ మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ ముందుగా బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం పుల్కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించి, ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. సంబంధిత మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం పుల్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పాఠశాల ఆవరణ, వసతి గృహాలు, తరగతి గదులు, నిల్వ గదులు, వంటశాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహార నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు, ఈగల వ్యాప్తి నివారణకు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు పరిశుభ్రమైన, పౌష్టికాహారం అందించాలని తెలిపారు. విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆరో తరగతి విద్యార్థినులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి పాఠ్యాంశాలపై అవగాహనను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులకు నోట్‌బుక్‌లు పంపిణీ చేసి, స్పష్టమైన లక్ష్యంతో కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ప్రోత్సహించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మండల విద్యాధికారి, కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## పీఎంకేఎస్‌వై పథకం కింద రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ

మెదక్ | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | జూలై 25: ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై 2.0) పథకం కింద మెదక్ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ బర్దీపూర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పి. సాయిబాబా, సాంకేతిక అధికారి కె. రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ పనులకు ఉపయోగపడే వివిధ రకాల ఆధునిక పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పి. సాయిబాబా మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ పరికరాల వినియోగంతో సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు ఉత్పాదకతను పెంచుకోవచ్చని తెలిపారు. సాంకేతిక అధికారి కె. రాజశేఖర్ రైతులకు అందించిన పరికరాల వినియోగ విధానం, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆధునిక పద్ధతులను అవలంబించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారిపై రాత్రి గస్తీ ముమ్మరం.. ప్రమాదాల నివారణకు చర్యలు: డీఎస్పీ ప్రసన్న కుమార్

సూర్యాపేట | సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి | జూలై 25: జాతీయ రహదారి-65పై ప్రమాదాల నివారణకు రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ పోలీసు, హైవే అధికారులను ఆదేశించారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని ఎఫ్‌సీఐ గోదాం జంక్షన్ వద్ద ప్రమాదకర ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం డీఎస్పీ కార్యాలయంలో ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్, జాతీయ రహదారుల అధికారులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది, సూర్యాపేట పట్టణ పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో హైవేలపై నిరంతర నిఘా కొనసాగించాలని, వాహనదారులు రహదారి మార్జిన్లలో వాహనాలను నిలిపివేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు పక్కన అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అలాంటి వాహనాలపై వెంటనే చలాన్లు విధించాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి, రహదారి పక్కన వాహనాల నిలుపుదలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అనంతరం సూర్యాపేట హైవే పరిధిలోని పలు ప్రమాదకర ప్రాంతాలను డీఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన ఉన్న గుంతలను గుర్తించి, వాహనదారుల భద్రత దృష్ట్యా వాటిని 24 గంటల్లోగా పూడ్చివేయాలని జాతీయ రహదారి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బ్లాక్ స్పాట్ల వద్ద అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రమాదాల సంఖ్యను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ పోలీసు సిబ్బంది, హైవే అథారిటీ ప్రతినిధులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన సందర్భంగా నడిగూడెం బీఆర్ఎస్ నాయకుల సేవా కార్యక్రమాలు



సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | జూలై 25: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని నడిగూడెం మండల బీఆర్ఎస్ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నడిగూడెం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నడిగూడెం మండల సమన్వయ సమితి కమిటీ సభ్యుడు అనంతుల ఆంజనేయులు మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రోగులకు అవసరమైన వైద్య పరీక్షలను ఆలస్యం చేయకుండా నిర్వహించి, సకాలంలో చికిత్స అందించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఆసుపత్రులను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సీహెచ్‌సీ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పనిశ్వరరావును కలిసి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు, మందులు, వైద్య పరీక్షలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు బోనగిరి ఉపేందర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, మండల మైనార్టీ నాయకుడు ఎస్‌కే జాలిల్, ఉద్యమ నాయకుడు దున్న ప్రవీణ్, మండల ఉపాధ్యక్షుడు దున్న రవి, వార్డు సభ్యులు పోలబోయిన నాగరాజు, తంగేళ్ల లింగయ్య, మండవ అనిల్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 30 నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించాలి: సీఎస్ సంజయ్ జాజు





ఖమ్మం | సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి శెట్టి సురేష్ | జూలై 25: ప్రభుత్వ, రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఆగస్టు 30 నాటికి రెండు జతల నాణ్యమైన యూనిఫాంలు అందేలా పకడ్బందీ ప్రణాళికతో చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, సెర్ప్ సీఈవో దివ్య, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌లతో కలిసి పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతి, సీజనల్ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పంటల వైవిధ్యీకరణను ప్రాధాన్య అంశంగా తీసుకుని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. గత ఏడాది ఇదే సమయానికి రాష్ట్రంలో సుమారు 54 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగగా, ప్రస్తుతం 14 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగు జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో సాగు చేయాల్సిన 1.39 కోట్ల ఎకరాల్లో ఇంకా మిగిలిన భూముల్లో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. జూలై 27 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో నిర్వహించే ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను విజయవంతం చేయాలని సూచించారు. కంది, పెసర, మినుములు, పప్పుధాన్యాలు, అలసందలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని అధిక నీటి అవసరమయ్యే పంటలపై ఆధారపడకుండా రైతులకు మార్గదర్శనం చేయాలని తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి ప్రతి విద్యార్థికి ఒక జత యూనిఫాం అందించేలా చర్యలు చేపట్టాలని, ఆగస్టు 30 నాటికి రెండు జతల యూనిఫాంల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. యూనిఫాంల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, వర్షపాతం లోటు కారణంగా రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి రైతు వేదికలో విత్తన మేళాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సెర్ప్ సీఈవో దివ్య మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల టైలర్ల ద్వారా యూనిఫాం కుట్టు పనులను వేగవంతం చేయాలని, వస్త్రాల సరఫరా, కటింగ్, కుట్టు పనులను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ తర్వాత ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించి, జిల్లాకు వచ్చిన వస్త్రాలు, మండలాలకు పంపిణీ, పూర్తయిన యూనిఫాంల వివరాలు, పాఠశాలలకు పంపిణీపై రోజువారీ నివేదికలు అందించాలని ఆదేశించారు. రోజుకు 5 వేల నుంచి 5,500 యూనిఫాంలు కుట్టేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అలాగే జిల్లాలో అవసరమైన విత్తనాలపై కంటింజెన్సీ ప్రణాళిక సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్, ఎస్‌డీసీ సదానందం, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రామారావు, డీఆర్‌డీవో శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆందోల్‌లో కారు బీభత్సం.. ముగ్గురికి తీవ్ర గాయాలు







సంగారెడ్డి | సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్ | జూలై 25: సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం రాంసాన్‌పల్లి సమీపంలోని జాతీయ రహదారి-161పై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో రవి కుమార్, ధృవతేజ్, సతీష్ తీవ్ర గాయాలపాలయ్యారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.



# నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి: బీఎస్పీ డిమాండ్

మెదక్ | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | జూలై 25: నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) డిమాండ్ చేసింది. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జి పీపడ్‌పల్లి మోహన్, జిల్లా అధ్యక్షుడు ఎర్ర శంకర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలపై సమగ్ర, పారదర్శక దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని బీఎస్పీ తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుత నిరసన తెలపడం ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని, ఆ హక్కును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీపై ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, జిల్లా జనరల్ సెక్రటరీ ఆశిష్, జిల్లా ట్రెజరర్ వై. ఆనంద్, జిల్లా సీనియర్ నాయకులు మనయ్య, సిద్ధిరములు, అసెంబ్లీ నాయకులు దసరాత్ తదితరులు పాల్గొన్నారు.




# కేవీపీఎస్ సామాజిక ఉద్యమ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపు

నారాయణఖేడ్,సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి,జూలై 25,నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా సామాజిక ఉద్యమ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. కేవీపీఎస్ కులవివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటం చేస్తుందని, దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా వారికి అండగా నిలిచి న్యాయం కోసం ఉద్యమిస్తోందని నాయకులు తెలిపారు. భారత రాజ్యాంగ పరిరక్షణ, రిజర్వేషన్ల అమలు, దళితుల హక్కుల సాధనతో పాటు దళితుల అసైన్డ్ భూముల రక్షణ కోసం కూడా పోరాటాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం సాధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులకు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, యువత అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొతారి నర్సింలు, సంతోష్, అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షులు కన్షిరాం, అంబేద్కర్ ఫూలే సేవా సమితి డివిజన్ అధ్యక్షులు ఎస్. నర్సింలు, జిల్లా సహాయ కార్యదర్శి గణపతి, మోహన్, దత్తా సాయి తదితరులు పాల్గొన్నారు.




# విమల్ రణదివే ఆశయాల కోసం పోరాడుతాం.. మహిళా కార్మిక హక్కుల కోసం ఉద్యమిస్తాం: సీఐటీయూ

మెదక్ | సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి | జూలై 25: కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ, మహిళా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కామ్రేడ్ విమల్ రణదివే ఆశయాలను కొనసాగిస్తూ ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం తెలిపారు. కామ్రేడ్ విమల్ రణదివే 26వ వర్ధంతి సందర్భంగా మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీఐటీయూ మెదక్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆమెకు విప్లవ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏ. మల్లేశం మాట్లాడుతూ విమల్ రణదివే తన జీవితాంతం కార్మిక వర్గ ప్రయోజనాలు, మహిళల హక్కులు, దోపిడీకి వ్యతిరేకంగా సాగిన పోరాటాలకు అంకితం చేశారని కొనియాడారు. 1915 ఏప్రిల్ 10న జన్మించిన ఆమె చిన్న వయసులోనే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాల్లో పాల్గొని ధైర్యసాహసాలను ప్రదర్శించారని గుర్తు చేశారు. పేదలు, కార్మికుల పట్ల ఉన్న అనుబంధంతో కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని స్వీకరించి, జైలు జీవితం, అజ్ఞాత జీవితం వంటి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ప్రజా ఉద్యమాల్లో కొనసాగారని తెలిపారు. 1946లో ముంబై కార్మిక వర్గం, నౌకాదళ సైనికుల చారిత్రాత్మక తిరుగుబాటులో పాల్గొని తన పోరాట స్ఫూర్తిని చాటుకున్నారని పేర్కొన్నారు. భారత కార్మిక ఉద్యమంలో విమల్ రణదివే సేవలు చిరస్మరణీయమని, అఖిల భారత ప్లాంటేషన్ కార్మికుల సమాఖ్య తొలి ప్రధాన కార్యదర్శిగా, సీఐటీయూ అనుబంధ అఖిల భారత అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ స్థాపక అధ్యక్షురాలిగా కార్మికుల గొంతుకగా నిలిచారని తెలిపారు. బీడీ కార్మికుల ఉద్యమాలకు కూడా ఆమె నాయకత్వం వహించారని అన్నారు. 1979లో దేశంలోని ట్రేడ్ యూనియన్లలో తొలిసారిగా మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి, ఉద్యోగ మహిళల సమస్యలపై నిరంతర పోరాటం చేశారని గుర్తు చేశారు. మహిళా కార్మికులను సంఘటితం చేయడంలో ఆమె చేసిన కృషి భారత కార్మిక ఉద్యమానికి బలమైన పునాదిగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సమానత్వం, న్యాయబద్ధమైన సమాజ నిర్మాణం కోసం విమల్ రణదివే ఆశయాల సాధనకు నిరంతరం పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి నరమ్మ, టౌన్ కార్యదర్శి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

# వరి నాట్లు వేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి రైతు మృతి







కోడూరు, సంగారెడ్డి జిల్లా,సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్,జూలై 25,పుల్కల్ మండలం కోడూరు గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వరి నాట్లు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోడూరు గ్రామానికి చెందిన మల్లేశం అనే రైతు తన పొలంలో వరి నాట్లు వేస్తుండగా కాలువ గట్టు అంచు నుంచి ప్రమాదవశాత్తు అదుపుతప్పి బురదలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్ర అస్వస్థతకు గురైన మల్లేశం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన సమయంలో రైతు మృతి చెందడంతో కోడూరు గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న మల్లేశంను కోల్పోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# భక్తి, ఆరోగ్యం, ఆధ్యాత్మికతకు ప్రతీక తొలి ఏకాదశి – పవన్ కుమార్



రాయికోడ్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, ఆషాఢ శుద్ధ ఏకాదశిని దేవశయనీ ఏకాదశి లేదా శయనీ ఏకాదశిగా పిలుస్తారని, చాతుర్మాస వ్రతాలకు శ్రీకారం చుట్టే ఈ పవిత్ర దినాన్ని తొలి ఏకాదశిగా భావిస్తారని రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అధ్యక్షులు, కర్చల్ గ్రామానికి చెందిన దాడువై పవన్ కుమార్ తెలిపారు. 2026 సంవత్సరంలో తొలి ఏకాదశి జూలై 25న శనివారం వస్తుందని పేర్కొంటూ, ఈ రోజు నుంచి శ్రీ మహావిష్ణువు క్షీరసాగరంలో ఆదిశేషునిపై నాలుగు నెలల పాటు యోగనిద్రలోకి వెళతారనే విశ్వాసం ఉందన్నారు. తొలి ఏకాదశి నుంచి ఉత్థాన ఏకాదశి వరకు కొనసాగే చాతుర్మాస కాలంలో ఉపవాసాలు, పూజలు, దానధర్మాలు, విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పఠనం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. మాంధాత చక్రవర్తి కథతో పాటు విష్ణుమూర్తి యోగనిద్రకు సంబంధించిన పురాణ గాథలు ఈ ఏకాదశి విశిష్టతను తెలియజేస్తాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో జీర్ణశక్తి తగ్గే పరిస్థితుల్లో ఉపవాసాలు, సాత్విక ఆహారం, నియమ నిష్ఠలు ఆరోగ్య పరంగా కూడా ఎంతో మేలు చేస్తాయని పెద్దలు చెబుతున్నారని తెలిపారు. తొలి ఏకాదశి భక్తి, ఆరోగ్యం, ప్రకృతి సమన్వయానికి ప్రతీకగా నిలుస్తుందని, ఈ పవిత్ర సందర్భంగా ప్రజలందరూ ఆధ్యాత్మిక చింతనతో సర్వేజనా సుఖినోభవంతు అనే భావనతో ముందుకు సాగాలని పవన్ కుమార్ ఆకాంక్షించారు.



# యంగ్ ఇండియా స్కూల్ పనుల్లో నాణ్యత తప్పనిసరి – విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

పుల్కల్, సంగారెడ్డి జిల్లా, సందేశం టైమ్స్ అందోల్ నియోజకవర్గం ఇంచార్జి కే. మల్లేశం గౌడ్, జూలై 25, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను ఆకస్మికంగా పరిశీలించారు. యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్, నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. డార్మిటరీలు, తరగతి గదులు, వంటశాల, స్టోర్ రూమ్‌లను పరిశీలించిన ఆయన ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యాన్ని మెరుగుపరచి ఈగలు, దోమల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో శంకర్‌ను ఆదేశించారు. విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఎస్ఓ ఇందిరాకు సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని కలెక్టర్ ప్రోత్సహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంఈవో శంకర్, ఆర్ఐ నరేష్, ఎంపీవో వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# సోయాబీన్ పంటను పరిశీలించిన వ్యవసాయ అధికారి

వెంకట్రావుపేట, మెదక్ జిల్లా, సందేశం టైమ్స్ అల్లాదుర్గం మండల రిపోర్టర్ ప్రవీణ్, జూలై 25, అల్లాదుర్గం మండలం వెంకట్రావుపేట గ్రామంలో రైతులు సాగు చేసిన సోయాబీన్ పంటను మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) రాజేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంట ఆరోగ్యకరంగా ఎదిగేందుకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, కలుపు నివారణ పద్ధతులు, ఎరువుల సరైన వినియోగం, చీడపీడల నివారణపై రైతులకు వ్యవసాయ అధికారి సూచనలు చేశారు. పంటను నిరంతరం పరిశీలిస్తూ ఏవైనా సమస్యలు గుర్తించిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ పర్యటనలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) నవీన్‌కుమార్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# దార్శనికతకు ప్రతీక... నవతరం స్ఫూర్తిప్రదాత కేటీఆర్‌కు జన్మదిన నీరాజనాలు




సంగారెడ్డి జిల్లా, సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్, జూలై 25, తెలంగాణ రాజకీయ యవనికపై తనదైన శైలిలో చెరగని ముద్ర వేసి నవతరం రాజకీయాలకు కొత్త భాష్యం చెప్పిన యువ నాయకుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రాజకీయ ప్రముఖులు, పరిశ్రమల ప్రతినిధులు, అభిమానులు, పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. విద్యాధికుడిగా, దార్శనికత కలిగిన నాయకుడిగా, సమర్థవంతమైన వ్యూహకర్తగా తనను తాను నిరూపించుకున్న కేటీఆర్ రాజకీయ ప్రస్థానం నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. అమెరికాలో ఉన్నత విద్యను పూర్తి చేసి బహుళజాతి సంస్థల్లో నిపుణుడిగా సేవలు అందించిన కేటీఆర్ తెలంగాణ ఉద్యమ పిలుపుతో స్వదేశానికి తిరిగి వచ్చి ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి వరుస విజయాలు సాధిస్తూ తన నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. అనర్గళమైన ప్రసంగ శైలి, విషయ పరిజ్ఞానం, వ్యూహాత్మక ఆలోచనలతో అసెంబ్లీలోనూ, ప్రజల మధ్యనూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణలో ఐటీ రంగ అభివృద్ధికి కేటీఆర్ చేసిన కృషి విశేషంగా నిలిచింది. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అమెజాన్, నోవార్టిస్ వంటి అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను విస్తరించడంలో ఆయన విజన్, కృషి కీలకంగా నిలిచిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దేశంలోనే ప్రముఖ స్టార్టప్ వేదికగా టి-హబ్, మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి వీ-హబ్, సాంకేతిక శిక్షణ కోసం టాస్క్ వంటి వినూత్న కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఐటీ రంగాన్ని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించే ప్రయత్నాలు చేశారు. పరిశ్రమలకు వేగవంతమైన అనుమతులు అందించే టీఎస్-ఐపాస్ విధానం ద్వారా పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించారని తెలిపారు. పురపాలక శాఖ మంత్రిగా హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ఎస్ఆర్‌డీపీ ద్వారా ఫ్లైఓవర్లు, కేబుల్ బ్రిడ్జిలు, అండర్‌పాస్‌ల నిర్మాణంతో రవాణా వ్యవస్థను మెరుగుపరిచారు. హరితహారం, నగర సుందరీకరణ, తాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. కేటీఆర్ పాలనా కార్యక్రమాలతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆపదలో ఉన్న వారికి సహాయం అందించడంలో ముందుంటారని అభిమానులు పేర్కొంటున్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు వైద్య సహాయం అందించడంలో ఆయన స్పందన ప్రజల ప్రశంసలు అందుకుంది. అందుకే ప్రజలు ఆయనను కేవలం రాజకీయ నాయకుడిగా కాకుండా కష్టకాలంలో అండగా నిలిచే నాయకుడిగా అభిమానిస్తున్నారని పేర్కొన్నారు. ఆధునిక ఆలోచనలు, వేగవంతమైన నిర్ణయాలు, ప్రజల పట్ల బాధ్యత కలిగిన నాయకుడిగా కేటీఆర్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని అభిమానులు, పార్టీ శ్రేణులు ఆకాంక్షించారు.




# జోగిపేటలో కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

జోగిపేట, సంగారెడ్డి జిల్లా, సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి, జూలై 25, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ 50వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జోగిపేట పట్టణంలోని హనుమాన్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డి.బి. నాగభూషణం, బీఆర్ఎస్ నాయకుడు చాపల వెంకటేశం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి, బంగారు తెలంగాణ సాధన లక్ష్యానికి కేటీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కేటీఆర్‌కు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తెలంగాణ సమాజం కేటీఆర్ నాయకత్వాన్ని ఆదరిస్తోందని, కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిర్ల శంకర్, పుర్ర సంతోష్, ఆకుల శంకర్, ఎం.డి. గొరే, పోలీస్ శంకర్ రావు, పరిపూర్ణం, రఫీక్, నారాయణ, ముస్లాపూర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు సభ్యులందరూ ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి



బహిరన్ దిబ్బ, మెదక్ జిల్లా, సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్, జూలై 25, అల్లాదుర్గం మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామ రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్ డీలర్ రాజు కీలక సూచనలు చేశారు. రేషన్ కార్డులో నమోదైన సభ్యులందరూ తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ-కేవైసీ చేయించుకోకపోతే భవిష్యత్తులో రేషన్ బియ్యం పంపిణీలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. లబ్ధిదారులు సమీప ఫెయిర్ ప్రైస్ షాప్ (రేషన్ డీలర్) లేదా సంబంధిత మీ సేవా కేంద్రంలో ఆధార్ బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని సూచించారు. ఈ ప్రక్రియ కోసం ఆధార్ కార్డు, రేషన్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన ఈ-కేవైసీ గడువు తేదీలోపు ప్రతి రేషన్ కార్డు సభ్యుడు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని రేషన్

# బోరంచ గ్రామానికి రూ.1.59 కోట్లతో నూతన పీహెచ్‌సీ మంజూరు



బోరంచ, నారాయణఖేడ్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, నారాయణఖేడ్ నియోజకవర్గంలోని బోరంచ గ్రామంలో అత్యాధునిక సౌకర్యాలతో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.59 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు జారీ చేయడంతో గ్రామ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు. నూతన పీహెచ్‌సీ నిర్మాణం పూర్తయితే బోరంచ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు గ్రామంలోనే అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డికి గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కె. బోజిరెడ్డి, ఉపసర్పంచ్ మొల్ల కరీం, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు లోకేష్ రెడ్డి, నల్ల పోచమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ మల్లయ్య, నర్సింహారెడ్డి, నర్సింలు, దీపక్ రెడ్డి, అఖిలేష్ రెడ్డి, మతీన్, మల్లేష్, గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్ర, జిల్లా జర్నలిస్టుల బస్ పాస్‌ల గడువు ఆగస్టు 3 వరకు పొడిగింపు



GOVERNMENT OF TELANGANA
INFORMATION AND PUBLIC RELATIONS DEPARTMENT::
HYDERABAD

From,
The Spl. Commissioner,
Information & Public Relations Dept.,
A.C. Guards, Hyderabad.

To,
The Managing Director,
TGSRTC,
Hyderabad.

Letter No. 001218/MR/2026, date: 23.07.2026.

Sir,

Sub:- I&PR Dept., - Media Relations Section – Issue of State and District Journalists bus passes - Reg.
Ref:- 1. This office letter no. 001218/MR/2026, dt. 10.06.2026, 01.07.2026.
2. This office letter no. 003491/MR/2024, dt. 30.04.2026 & dt. 29.05.2026.
***

I am to inform that the accreditation cards for the years 2026-2028 are issued to the working journalists at state and district level. The issuing of further cards is still in process. However the old accreditation cards (2024-2026) validity is further extended upto 03.08.2026.

Hence you are requested to extend the validity period of all the old state and district journalists bus passes for (12) days i.e., from 23.07.2026 upto 03.08.2026 without insisting for validity period on the accreditation cards.

Yours Faithfully
Sd/- Dr. G. Mukunda Reddy
Spl. Commissioner

Copy to
The Chairman, Media Academy of Telangana State.
The Regional Joint Director, Multi Zone-I & Multi Zone-II.
All the DPRO's in the State for information and necessary action.

//f.b.o//

Addl. Director (PAC)

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టులకు జారీ చేసిన పాత అక్రిడిటేషన్ కార్డుల ఆధారంగా పొందిన ఆర్టీసీ బస్ పాస్‌ల గడువును మరో 12 రోజుల పాటు పొడిగిస్తూ తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ (ఐఅండ్‌పీఆర్) ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ జి. ముకుంద రెడ్డి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు. 2026-2028 సంవత్సరాలకు సంబంధించి రాష్ట్ర, జిల్లా స్థాయి పనిచేస్తున్న జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోందని, ప్రస్తుతం కొన్ని కార్డుల జారీ ప్రక్రియ పూర్తి కాలేదని లేఖలో పేర్కొన్నారు. 2024-2026 కాలానికి సంబంధించిన పాత అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటు గడువును 2026 ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టులకు జారీ చేసిన పాత బస్ పాస్‌ల చెల్లుబాటును జూలై 23, 2026 నుంచి ఆగస్టు 3, 2026 వరకు మరో 12 రోజుల పాటు పొడిగించాలని, బస్ పాస్‌లపై అక్రిడిటేషన్ కార్డు గడువు తేదీని పరిశీలించకుండా ప్రయాణానికి అనుమతించాలని టీజీఎస్ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ ఉత్తర్వుల ప్రతులను తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, మల్టీ జోన్-1, మల్టీ జోన్-2 ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, రాష్ట్రంలోని అన్ని జిల్లా పౌర సంబంధాల అధికారులకు సమాచారార్థం, అవసరమైన చర్యల కోసం పంపించారు.




# పక్కాగా ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యం కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, జిల్లాలో ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితాను పారదర్శకంగా, ఎలాంటి తప్పులు లేకుండా రూపొందించడమే లక్ష్యంగా ఎన్నికల యంత్రాంగం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా, డిజిటలైజేషన్ పురోగతిపై కలెక్టర్ పలు వివరాలను వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఓటర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే డిజిటలైజేషన్ ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 10,08,252 మంది ఓటర్లు ఉండగా ఇప్పటివరకు 9,34,581 మంది ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇది 92.69 శాతానికి సమానమని వెల్లడించారు. మిగిలిన 73,671 మంది ఓటర్ల వివరాలను కూడా త్వరలోనే సిస్టమ్‌లో నమోదు చేస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా ఉండేలా చర్యలు పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదుతో పాటు మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు ఉన్న వారి వివరాలను గుర్తించి సవరణలు చేస్తున్నారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. డిజిటలైజేషన్ ద్వారా ఓటరు కార్డుల్లో తప్పులు లేకుండా చూడడంతో పాటు డూప్లికేట్ ఓట్లకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి ఎన్నికల ప్రక్రియను మరింత సులభతరం చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో మొత్తం 10,08,252 మంది ఓటర్లు ఉండగా, 9,34,581 మంది ఓటర్ల డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇంకా 73,671 మంది వివరాలు నమోదు చేయాల్సి ఉందని, మొత్తం 92.69 శాతం ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. జిల్లా పౌర సంబంధాల అధికారి సూర్యాపేట వారి ద్వారా ఈ ప్రకటన జారీ చేయబడింది.




# ప్రత్యామ్నాయ పంటల సాగును ఉద్యమంలా చేపట్టాలి: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, రాష్ట్రంలో నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితులను అవకాశంగా మలుచుకొని రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు విస్తృతంగా మళ్లించాలని, అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను నిర్ణీత గడువులోగా అందించేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, సెర్ప్ సీఈవో దివ్య, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌లతో కలిసి పాఠశాల యూనిఫాంల కుట్టు పనుల పురోగతి, సీజనల్ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రస్తుతం పంటల వైవిధ్యీకరణ అత్యంత ముఖ్యమైన అంశమని తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి రాష్ట్రంలో సుమారు 52 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం 14 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి విత్తనం పూర్తయిందని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 1.39 కోట్ల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా ఇప్పటివరకు సగం విస్తీర్ణంలో మాత్రమే సాగు పూర్తయిందని, మిగిలిన భూముల్లో సాధ్యమైనంత వరకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు. భూములను బీడుగా వదిలిపెట్టకుండా కంది, పెసర, మినుములు, ఇతర పప్పుధాన్యాలు, అలసందలు, పొద్దుతిరుగుడు, కూరగాయలు, చిరుధాన్యాలు వంటి పంటలను పెద్దఎత్తున సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. జూలై 27 నుంచి 29 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో నిర్వహించే ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాలను విజయవంతం చేయాలని కోరారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని బోరు నీటిపై ఆధారపడే వరి సాగును తగ్గించి తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులను మళ్లించాలని తెలిపారు. అనంతరం పాఠశాల యూనిఫాంలపై మాట్లాడుతూ ఆగస్టు 30 నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందేలా పకడ్బందీ ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. యూనిఫాంల తయారీలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండరాదని, వస్త్రాల సరఫరా, కటింగ్, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా కుట్టు పనులు, సరఫరా ప్రక్రియలను జిల్లా, మండల స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులందరికీ ఆగస్టు 30 నాటికి రెండు జతల యూనిఫాంలు అందించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలోని జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్నాయని, వర్షపాతం లోటు నమోదవుతున్న నేపథ్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జూలై 27 నుంచి 29 వరకు రైతు వేదికల్లో విత్తన మేళాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులతో సమీక్ష నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పాఠశాల యూనిఫాంల కుట్టు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. రైతు వేదికలు, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా ప్రత్యామ్నాయ పంటలపై ప్రచారం నిర్వహించి రైతులు అధిక సంఖ్యలో వాటి సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ సన్యాసయ్య, జడ్పీ సీఈవో శిరీష, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సీపీవో కిషన్, డీపీఓ యాదగిరి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీఈవో అశోక్, ఎస్సీ అభివృద్ధి అధికారి దయానంద రాణి, ఉద్యానవన అధికారి నాగయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# బేటీ బచావో - బేటీ పడావో నిధులతో బాల భవన్ విద్యార్థులకు హైదరాబాద్ విహారయాత్ర

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలోని మహిళా సాధికారత కేంద్రం (డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్) ఆధ్వర్యంలో బేటీ బచావో - బేటీ పడావో నిధులను వినియోగిస్తూ బాల భవన్ విద్యార్థినుల కోసం హైదరాబాద్ విహారయాత్రను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పర్యటనకు బయలుదేరుతున్న బాల భవన్ విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి, మానసిక ఉల్లాసానికి ఇటువంటి విహారయాత్రలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా విద్యార్థులు చారిత్రక, సాంస్కృతిక, విజ్ఞాన సంబంధిత ప్రదేశాలను సందర్శించి కొత్త విషయాలను తెలుసుకోవాలని ఆకాంక్షించారు. ఆడపిల్లల విద్య, సాధికారతే లక్ష్యంగా బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె. నర్సింహారావు, ఏసీడీపీవో కిరణ్మయి, డీసీపీవో రవికుమార్, మహిళా సాధికారత కేంద్ర జిల్లా కోఆర్డినేటర్ చైతన్య, సిబ్బంది, బాల భవన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నగళ్ల గోపాల్‌కు ఘనంగా 31వ జన్మదిన వేడుకలు



మరవెల్లి, సంగారెడ్డి జిల్లా, సందేశం టైమ్స్ వట్పల్లి మండల ప్రతినిధి, జూలై 25, సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం మరవెల్లి గ్రామానికి చెందిన నాగళ్ల గోపాల్ 31వ జన్మదిన వేడుకలను బంధుమిత్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి గోపాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గోపాల్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, జీవితంలో మరిన్ని విజయాలు సాధిస్తూ ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మన్నే జగదీశ్వర్ నాగళ్ల గోపాల్‌కు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొని గోపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



కొత్తగూడెం, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, సింగరేణి సంస్థను కాపాడుకోవడంతో పాటు మరింత బలోపేతం చేసి అంతర్జాతీయ స్థాయికి విస్తరించేందుకు ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వ తలుపులు 24 గంటలూ తెరిచి ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు. కొత్తగూడెంలోని సింగరేణి కార్యాలయంలో సింగరేణి, జెన్‌కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాబోయే 15 నుంచి 20 ఏళ్లలో ఇంధన రంగంలో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయని పేర్కొన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో థర్మల్ విద్యుత్, బొగ్గు వినియోగం క్రమంగా తగ్గే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా కొత్త రంగాల్లోకి విస్తరించాల్సిన అవసరం ఉందని సూచించారు. తెలంగాణకు సింగరేణి ఆత్మవంటిదని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థ భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణికి ఏకఛత్రాధిపత్యం ఉండేదని, ప్రస్తుతం బొగ్గు రంగంలో ప్రైవేటీకరణ పెరగడంతో ప్రభుత్వ రంగ సంస్థలు కూడా పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రైవేట్ సంస్థలతో పోటీ పడేందుకు నాణ్యత, నిర్వహణ వ్యయ నియంత్రణ, మెరుగైన సేవలపై దృష్టి సారించి సింగరేణి తన ప్రత్యేకతను నిలబెట్టుకోవాలని సూచించారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠిన పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు శుద్ధీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి, వివిధ గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో కలిపి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ముందుచూపుతో ప్రణాళికలు రూపొందించకపోవడం వల్ల సింగరేణి కొత్త బొగ్గు బ్లాకుల వేలంలో పూర్తిస్థాయిలో పాల్గొనలేకపోయిందని ఉప ముఖ్యమంత్రి విమర్శించారు. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లకు అవసరమైన బొగ్గు బ్లాకుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం జరిగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల-2 ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించిందని తెలిపారు. సింగరేణి కేవలం వ్యాపార సంస్థ మాత్రమే కాదని, వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితాలతో ముడిపడి ఉన్న సంస్థ అని అన్నారు. సంస్థ లాభాల్లో కొనసాగితేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి గని స్థాయిలో యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి కార్మికులతో చర్చలు నిర్వహించి సంస్థ అభివృద్ధికి అవసరమైన సూచనలు స్వీకరించాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణి రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్ రంగంలోకి కూడా అడుగుపెట్టాలని తెలిపారు. సెమీకండక్టర్లు, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగాల్లో సింగరేణి విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో క్రిటికల్ మినరల్స్ వేలంలో పాల్గొనే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని, వారి నైపుణ్యాలను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు వినియోగించుకోవాలని తెలిపారు. ఇకపై సింగరేణి బోర్డు సమావేశాలు కేవలం సాధారణ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా సంస్థ విస్తరణ, రాబోయే పదేళ్ల అభివృద్ధి ప్రణాళికపై విస్తృతంగా చర్చించాలని అధికారులకు సూచించారు. కార్పొరేట్ సంస్థల తరహాలో సమయపాలనతో లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేలా కార్యాచరణ రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# వన మహోత్సవం-2026లో భాగంగా ప్రతి కుటుంబానికి ఉచితంగా ఐదు మొక్కల పంపిణీ

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం-2026 కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) అర్బన్ ఫారెస్ట్రీ విభాగం ప్రజల భాగస్వామ్యంతో నగర హరితాభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా జూలై 25వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు తార్నాకలోని మర్రి లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్‌లో తారక సేవా సమాఖ్య స్వచ్ఛంద సంస్థ సహకారంతో ప్రతి కుటుంబానికి ఐదు ఉచిత మొక్కలను పంపిణీ చేయనున్నట్లు హెచ్ఎండీఏ ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా పండ్ల మొక్కలు, ఔషధ మొక్కలు, అలంకరణ మొక్కలను ప్రజలకు అందజేయనున్నట్లు వెల్లడించారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించడం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, భూగర్భ జలాల పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణతో పాటు ప్రతి ఇంటిలో ఆరోగ్యకరమైన ఇంటి తోటల ఏర్పాటును ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరై ఉచిత మొక్కలను పొందడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం కోరింది. స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ఈ ప్రకటన జారీ చేయబడింది.

# బెల్లంపల్లి గురుకుల ఫుడ్ పాయిజన్ ఘటనపై మానవ హక్కుల కమిషన్ సుమోటో

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు ఆహార విషబాధకు గురైన ఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్ఆర్సీ) సుమోటోగా స్వీకరించింది. నమస్తే తెలంగాణ తెలుగు దినపత్రికలో జూలై 24వ తేదీన "బాలికల గురుకులంలో ఫుడ్ పాయిజన్" శీర్షికతో ప్రచురితమైన వార్తను ఆధారంగా తీసుకున్న కమిషన్ ఈ ఘటనపై విచారణ చేపట్టింది. తెలంగాణ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. గురుకుల పాఠశాలలో విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి, ఆహార నాణ్యత, తీసుకున్న భద్రతా చర్యలు తదితర అంశాలపై పూర్తి వివరాలతో నివేదిక అందించాలని కమిషన్ సూచించింది. ఈ కేసును నివేదిక సమర్పణ కోసం ఆగస్టు 25, 2026కు వాయిదా వేసింది. తెలంగాణ మానవ హక్కుల కమిషన్ ప్రజల హక్కుల పరిరక్షణలో భాగంగా ఈ ఘటనను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. // ఆదేశానుసారం // పీఆర్వో, టీజీహెచ్ఆర్సీ.

# డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా మీ సేవ కేంద్రాలు: చిన్న వ్యాపారాలకు కొత్త అవకాశాలు



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్డీ-మీ సేవ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన మెటా సంస్థ సహకారంతో రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలను డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా తీర్చిదిద్దే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రకటనల సేవలు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో క్యూర్ ప్రాంతానికి చెందిన 150 మందికి పైగా మీ సేవ గ్రామస్థాయి వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు. మెటా వేదికలైన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో ప్రకటనలను రూపొందించడం, వాట్సాప్ బిజినెస్ ఖాతాను ఏర్పాటు చేయడం, ఉత్పత్తులు, సేవలను డిజిటల్ మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం, వినియోగదారులను గుర్తించడం, ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలపై వారికి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమం ద్వారా కిరాణా దుకాణాలు, పండ్ల వ్యాపారులు, స్వీట్ షాపులు, రెస్టారెంట్లు, మెడికల్ షాపులు, ఆసుపత్రులు, పాఠశాలలు, సెలూన్లు, మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ సంస్థలు, ఇతర వ్యాపార సంస్థలు తమ సమీపంలోని మీ సేవ కేంద్రాలను సంప్రదించి మెటా వేదికలపై వృత్తిపరమైన డిజిటల్ ప్రకటనలను రూపొందించి ప్రచారం చేసుకునే అవకాశం పొందనున్నాయి. మీ సేవ నిర్వాహకులు ప్రకటనల రూపకల్పన, ప్రచార కంటెంట్ తయారీ, సరైన వినియోగదారుల ఎంపిక, ప్రకటనల నిర్వహణలో వ్యాపారులకు సహాయ సహకారాలు అందించనున్నారు. దీంతో చిన్న వ్యాపారాలు తమ ఉత్పత్తులు, సేవలను ఎక్కువ మంది వినియోగదారులకు చేరవేసుకుని వ్యాపార అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మీ సేవ కమిషనర్ టి. రవి కిరణ్ మాట్లాడుతూ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం సాంకేతికతను వినియోగించి పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారుల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. మెటా సంస్థకు ఉన్న ప్రపంచ స్థాయి డిజిటల్ ప్రకటనల నైపుణ్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న మీ సేవ కేంద్రాల నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న వ్యాపారాలకు కూడా నాణ్యమైన డిజిటల్ మార్కెటింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యంతో మీ సేవ కేంద్రాలు ఇకపై పౌర సేవలకే పరిమితం కాకుండా డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా మారి చిన్న, మధ్య తరహా వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు అదనపు ఆదాయ అవకాశాలను కల్పిస్తూ తెలంగాణ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్డీ-మీ సేవ), సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్ శాఖ, తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది.

# నెలరోజుల్లో ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫాంలు అందించాలి: సీఎస్ సంజయ్ జాజు




హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నెలరోజుల్లోగా రెండు జతల యూనిఫాంలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్కూల్ యూనిఫాంల తయారీ, పంపిణీ, ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ ప్రణాళికలపై శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ యూనిఫాంల తయారీ, పంపిణీ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సూచించారు. యూనిఫాంల కుట్టు పనుల కోసం 26 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులకు అందించే స్కూల్ డ్రెస్‌లు, షూస్, ఇతర పాఠశాల కిట్ల నాణ్యతపై నేరుగా విద్యార్థుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని ముఖ్యమంత్రి ఆదేశించిన విషయాన్ని సీఎస్ గుర్తు చేశారు. యూనిఫాంల తయారీ, సరఫరా ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, మండల స్థాయిలో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం లోటు నమోదవుతున్న నేపథ్యంలో రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. భారత వాతావరణ శాఖ నివేదికల ప్రకారం తెలంగాణలో ఇప్పటివరకు 27 శాతం వర్షపాతం లోటు నమోదైందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని 7 జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదవుతుండగా, మిగిలిన 385 మండలాల్లో వర్షపాతం లోటు ఉన్నట్లు వెల్లడించారు. వాతావరణ పరిస్థితులకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు వాట్సాప్ ద్వారా అందిస్తున్నామని అధికారులు తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కూడా వర్షాలు ఆశాజనకంగా లేవని, ప్రధాన జలాశయాల్లో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం నిల్వ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో వరి సాగు 24 శాతం కంటే తక్కువగా నమోదైందని, సెప్టెంబర్‌లో కూడా వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపినట్లు అధికారులు వివరించారు. వరికి బదులుగా ఇతర ప్రత్యామ్నాయ పంటలకు కనీస మద్దతు ధర లభిస్తున్నందున రైతులను ఆ దిశగా చైతన్యపరచాలని సీఎస్ ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో ఫామ్ పాండ్ల నిర్మాణాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ప్రతి 45 రోజులకు ఒకసారి మండల స్థాయి సమావేశాలు నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సవ్యసాచి ఘోష్, దాన కిశోర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్య, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు. స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ద్వారా ఈ ప్రకటన జారీ చేయబడింది.

# ప్రభుత్వ పాఠశాలల బ్రేక్‌ఫాస్ట్ పథకానికి రూ.22.18 కోట్ల సీఎస్ఆర్ నిధులు





హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్, దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్, అరబిందో ఫార్మా లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న బ్రేక్‌ఫాస్ట్ పథకానికి సంబంధించి దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్, అరబిందో ఫార్మా లిమిటెడ్ సంస్థలు సీఎస్ఆర్ నిధులను ముఖ్యమంత్రి సమక్షంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్‌కు అందజేశాయి. అరబిందో ఫార్మా లిమిటెడ్ తరఫున రూ.10 కోట్లు, దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ తరఫున రూ.12.18 కోట్లు కలిపి మొత్తం రూ.22.18 కోట్ల నిధులను అందించారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి తెలిపారు. సెంట్రలైజ్డ్ కిచెన్లు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో పరిసర ప్రాంతాల రైతులను ఆదుకునేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. అవసరమైన కూరగాయలు, బియ్యం, ఇతర ఆహార పదార్థాలను నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుని, రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, తద్వారా పంటల మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయం కల్పించవచ్చని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంక్షేమం కోసం సీఎస్ఆర్ నిధులు అందించిన దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్, అరబిందో ఫార్మా లిమిటెడ్ సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. శ్రీధర్, హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ అధ్యక్షుడు సత్య గౌర చంద్ర దాస ప్రభు జీ, దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ మధు బాబు, అరబిందో ఫార్మా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్రానికి సమగ్ర నివేదిక: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూలై 25, కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జలశక్తి మంత్రిత్వ శాఖ, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్డీఎస్ఏ) నుంచి స్పష్టమైన సాంకేతిక మార్గదర్శకాలు కోరాలని సూచించారు. ఎన్డీఎస్ఏ సూచనల మేరకే ఇప్పటివరకు మూడు బ్యారేజీలను నీటి నిల్వ లేకుండా ఫ్రీ-ఫ్లో విధానంలో నిర్వహిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో బ్యారేజీలలో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా లేదా అనే అంశంపై రాజకీయ ఒత్తిళ్లు, తాత్కాలిక పరిస్థితుల ఆధారంగా కాకుండా అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కేంద్రానికి పంపే నివేదికలో ఎన్డీఎస్ఏ సూచనలు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫోటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలను జతచేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీలను నీటి నిల్వకు, పంపింగ్‌కు ఎందుకు వినియోగించడం లేదనే విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి

తీసుకోవాలని సూచించారు. జలశక్తి మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులకు లేఖను రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా స్వయంగా అందజేయాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్‌తో పాటు పలువురు సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, సాంకేతిక పరీక్షలు కేంద్ర ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. బ్యారేజీల పునరుద్ధరణ పనులపై జరిగిన సమీక్షలో అధికారులు మేడిగడ్డ బ్యారేజీతో పాటు అన్నారం బ్యారేజీ రాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్లు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ నీటి నిల్వ చేయడం సురక్షితం కాదని అధికారులు పేర్కొన్నారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ తాజా జీపీఆర్ పరీక్షలు, ఇతర సాంకేతిక విశ్లేషణలను తుది దశకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ కాన్సెప్ట్ డిజైన్ ఆగస్టు నెలాఖరులోగా సిద్ధమవుతుందని, సెప్టెంబర్ మధ్య నాటికి ప్రాథమిక వ్యయ అంచనాలు సిద్ధం కానున్నాయని అధికారులు వెల్లడించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అదనపు సాంకేతిక విశ్లేషణలు మరో రెండు వారాల్లో పూర్తవుతాయని, అనంతరం వాటిని సాంకేతిక పర్యవేక్షణ కమిటీ ముందు ఉంచాలని మంత్రి ఆదేశించారు. కేవలం దిగువకు నీరు ప్రవహిస్తున్నంత మాత్రాన పంపింగ్ సాధ్యమవుతుందని భావించడం సరికాదని అధికారులు వివరించారు. పంపింగ్‌కు అవసరమైన నీటి మట్టం, నిర్మాణ భద్రత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తాత్కాలిక ఏర్పాట్లతో పంపింగ్‌కు ప్రయత్నించడం వల్ల బ్యారేజీల కింద ఉన్న నిర్మాణ సమస్యలు మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఒక్క అడుగు కూడా రాజకీయ ఒత్తిళ్లతో వేయబోమని, ప్రతి నిర్ణయం శాస్త్రీయ ఆధారాలు, ఇంజినీరింగ్ ప్రమాణాలు, నిపుణుల సిఫారసుల ఆధారంగానే ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పురోగతిపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. నీటి కేటాయింపులు, ట్రిబ్యునల్‌లో పెండింగ్ అంశాలు పరిష్కారం కాకపోవడంతో ప్రస్తుతం డీపీఆర్ ప్రక్రియ ముందుకు సాగడం లేదని అధికారులు వివరించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.